# తెలుగు బాల శతకం



డా॥ గుమ్మా సాంబశివరావు
ఎం.ఏ., పిహెచ్.డి.,

# తెలుగు బాల శతకం

డా॥ గుమ్మా సాంబశివరావు
ఎం.ఏ., పిహెచ్.డి.

ప్రచురణ :
కళాసుషమ ప్రచురణలు
శ్రీ సదన్ అపార్టుమెంట్స్, వినాయక థియేటర్ వెనుక,
విజయవాడ - 520 008. ఫోన్ : 0866-2453529

**తెలుగుబాల శతకం**

డా॥ గుమ్మా సాంబశివరావు

ప్రథమ ముద్రణ : జనవరి 2010

ప్రతులు : 1000

మూల్యం : రూ. **20-00**

ప్రతులకు :
**శ్రీమతి శశికళ,** **M.A. M.L.I.Sc**
శ్రీ సదన్ అపార్టుమెంట్స్, ఎఫ్-3
వినాయక థియేటర్ వెనుక,
విజయవాడ - 520 008.
ఫోన్ : 0866-2453529
సెల్ : 98492 65025

ముద్రణ :
**నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్**
విజయవాడ - 520 003.
ఫోన్ : 0866-2574828

# అంకితం



చిలకపాటి వంశక్షీరాబ్ధి చంద్రుండు
పూర్ణ చంద్రరావు బుధనుతుండు
నన్ను తీర్చి నట్టి నాగురుశ్రేష్ఠుని
ఆత్మ శాంతి కొఱకు అంకితమ్ము.

గుమ్మా సాంబశివరావు

## శతక కర్త తల్లి దండ్రులు

### గుమ్మా పార్వతమ్మ అయితమరాజు



ఉ॥ మా, చదివేసుతుండితడె మాకు యశంబును గూర్చువాడు వీ
డే, చతురుండు వీడనుచు నెందరి ముందరొ గొప్ప గొప్పగా
నేచిన ప్రేమతో పలుకు నిర్మలమూర్తులు తల్లిదండ్రులై
బ్రోచిన పార్వతమ్మ సమబుద్ధుడు ఐతమరాజు గొల్చెదన్.

## భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్



నిత్య యజ్ఞములను నిష్ఠతో నొనరించి
అద్భుతంపు ఫలము లందజేసి
ఆశు కవిత తోడ అలరించుచుండెడి
నాదు తమ్ము ందలతు నయము గాను.

# నామాట

ఒకరోజు శ్రీ కృత్తి వెంటి బాపిరాజు గారు (అమ్మ, బాపు, సిసింద్రీ సంపాదకులు) సిసింద్రీ అనే బాలల పత్రిక నాకు ఇచ్చారు. అందులో పిల్లలకు సంబంధించిన గేయాలు, కథలు, పద్యాలు, సామెతలు మొదలైన వెన్నో ఉన్నాయి. ఆ పత్రిక నన్నెంతో ఆకర్షించింది. వెంటనే పిల్లలకోసం ఏమైనా రాస్తే బాగుంటుందనిపించి, 'తెలిసి మెలగ మేలు తెలుగుబాల' అనే మకుటంతో ఐదు పద్యాలు రచించి సిసింద్రీ పత్రికకు పంపాను. తర్వాతి సంచికలో వాటిని ప్రచురించారు. ఆ స్ఫూర్తితో ఒక శతకం రాస్తే బాగుంటుందనిపించి అప్పుడప్పుడూ కొన్ని పద్యాలు రాశాను. 116 పద్యాలు రచించి వాటిని 108కి తగ్గించి శతకంగా ప్రచురించుదామనుకొని దాదాపు సంవత్సరం అయింది. ఇటీవల మా కనిష్ఠ సోదరులు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేకంట కాళీకృష్ణ గరుమహరాజ్‌గారి పుస్తకం 'తిరుమలేశుని లీలా వైభవం' ప్రచురితమవుతున్న సమయంలో నాశతకం సంగతి చెప్పాను. వెంటనే ముద్రించమని చెప్పటంతో ఈ విధంగా పాఠకలోకం ముందు 'తెలుగుబాల శతకం' ఉంచుతున్నాను. 'తెలుగుబాల పేరుతో ఇంతకు ముందు కొన్ని శతకాలు వచ్చాయి. కానీ నా రచన నాది.

పూర్వం ప్రాథమిక పాఠశాలల్లో శతక పఠనం తప్పని సరిగా ఉండేది. పాఠ్యాంశాల్లో ఉన్న వాటినీ, పాఠ్యాంశాల్లో లేకపోయినా మంచి పద్యాలను కొన్న వాటిని ఉపాధ్యాయులు పిల్లలకు నేర్పించేవారు. శతకాల్లో ఎన్నో నీతులుంటాయి. ప్రవర్తనా నియమావళిని క్రమబద్ధం చేసుకోవటానికి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందింపచేసుకోవటానికి అవసరమైన ఎన్నో విషయాలు శతకాల్లో ఉంటాయి. శతకం ఒక నేస్తం లాంటిది. ఇంగ్లీషు పిచ్చి ముదిరిపోయి తెలుగు భాష మీద మమకారం తగ్గుతున్న ఈ రోజుల్లో పిల్లలకు మనం తప్పని సరిగా శతకాలు నేర్పించాలి. ఈ ఉద్దేశంతోనే తెలుగు భాషామాధుర్యాన్ని, క్రమ శిక్షణాయుతమైన ప్రవర్తనావశ్యకతను వివరిస్తూ ఈ శతకాన్ని రచించాను. ఇది సహృదయుల మన్ననలు పొందుతుందని ఆశిస్తున్నాను.

**డా॥ గుమ్మా సాంబశివరావు**

# తెలుగు బాల శతకం

1. వేకువందు లేచి వేడ్కగాపాఠాలు
చదువుచుండవలయు చక్కగాను
ఉదయసమయ పఠన ముత్సాహమిచ్చును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

2. బడికి వెళ్లుటకును గొడవ చేయగరాదు
తల్లిదండ్రి మాట తప్పరాదు
పెద్దవారి మాట పెన్నిధి సమమౌను
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

3. గురువు పలుకులెల్ల గురుతుగా గమనించి
పదిలపరచుకొనుము హృదయమందు
చిన్ననాటి గుర్తు చిత్తమ్ము వీడదు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

4. తోటివారి తోడ పోటీలు పడుచుండ
విద్య వృద్ధి యగును వెలుగు కలుగు
ఈర్ష్య ఉండరాదు ఇతరపిల్లలపైన
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

5. అడగ వలయు విషయమర్థమ్ము గాకున్న
తెలివి పెంచు ప్రశ్న తేజమొసగు
చిలిపి ప్రశ్నలైన చేటును కలిగించు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

6. పుస్తకములలోని పుణ్యశీలుర కథల్
చదువు చుండ వలయు సరసరీతి
ఘనుల జీవితములె ఘనమార్గములు చూపు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

7. అలరు చుండ వలయు నన్నదమ్ములవోలె
శిష్యులెల్ల మిగుల శ్రేష్ఠులగుచు
కులమతాల గోడ కూల్చుట యుక్తమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

8. ఒళ్ళు వంచి పనుల నుత్సాహముగ చేయ
ఫలితమదియె కలుగు బాగుగాను
కష్ట పడెదు గుణము ఘన కీర్తి కలిగించు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

9. చిన్నవయసునందె చిత్తాలు రంజించు
పద్యతతులు నేర్చి పలుక వలయు
పద్య ధారణమ్ము ప్రతిభను పెంచును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

10. ఆటపాటతోడ హాయిగా చదువంగ
చదువు తలల కెక్కు ఛాత్రులకును
ఆటపాట లెపుడు ఆరోగ్య మందించు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

11. యాత్రవలన జ్ఞానమభివృద్ధి యగునంచు
పలుకునట్టి తీరు ప్రబలమయ్యె
దేశమైన చూడు కోశమైనను చూడు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

12. బట్టి పట్టరాదు పాఠ్యాంశములనెల్ల
తెలిసి చదువ మేలు కలుగుచుండు
బట్టి గొట్టువాడు ఒట్టి బడుద్ధాయి
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

13. తిండితినెడియపుడు మొండిగా నుండుట
బాలవర్గమునకు భావ్యమగునె?
తిండి కలిగినపుడె కండకలుగుగదా!
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

14. అక్క, బావ, మామ అన్నయను పిలుపు
ప్రేమ రసము నింపు పెల్లుగాను
తల్లిబాసమనల తనియింపచేయును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

15. తెలుగు భాషలోన తేనెలు ప్రవహించు
తీపిరుచుల భాష తెలుగు భాష
తెలుగు మాట వలన తేజమ్ము పెరుగును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

16. పాఠ్యబోధ చేయు పంతులయ్యల చూచి
పిచ్చి పేర్లతోడ పిలువరాదు
గురుల గౌరవించు గొప్పజాతి మనది
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

17. చెట్టు నీడ నిచ్చి సేదదీర్చుచునుండు
ఫలము లిచ్చిచెట్టు బలము పెంచు
చెట్లు పెంచినపుడు చిక్కులు దీరురా
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

18. అమ్మ అనెడి పిలుపు అమృతము వలెనుండు
నాన్న యనెడి పిలుపు వెన్న సమము
అమ్మ నాన్న పిలుపు లాప్యాయతల్ పెంచు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

19. చీమ లెల్ల చెక్కు చెదరక పంక్తిలో
నడచునట్టి తీరు నరసినపుడు
క్రమము తప్ప కుండ గమియింప వలెనంచు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

20. తెలివిగలిగినంత తేజమ్ము కలుగదు
ఉన్న తెలివి వృద్ధి నొందుటకును
సాధనమ్ము వలయు చదువులందెప్పుడు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

21. మాటలందు వినయ మాధుర్యములు నింపి
మాటలాడినపుడు మన్ననగును
నోరుమంచిదైన ఊరుమంచిదగును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

22. తల్లి బాస నెఱిగి యెల్ల బాసలు నేర్వ
ప్రతిభ పదునుదేరు బాగుగాను
ఇంట గెలిచిరచ్చ కెక్కుట మేలౌను
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

23. చదువు మీద శ్రద్ధ చక్కగా చూపింప
మేధ పెరుగుచుండు మేటిగాను
చదువు కీర్తి నిచ్చు సౌభాగ్యమొసగును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

24. ఆంధ్రులకును సొత్తు అష్టావధానమ్ము
అక్షరముల తోడి ఆటయగుచు
సంత సింపచేయు సాహితీ ప్రియులను
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

25. అచ్చులంత మందు నలరు చుండెడి భాష
తెలుగు భాషకాదె తెలిసికొనగ
గానయోగ్యమైన గాంధర్వ మేతెల్గు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

26. అన్ని ఋతువులందు అందుబాటుననుండు
ఎట్టి ఫలములైన నిట్టె తినగ
అమరుచుండు నెపుడు ఆరోగ్యభాగ్యమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

27. చెలిమితోడ మెలగు స్నేహితుండుండిన
బాధలన్ని తొలగు పరువు పెరుగు
కష్ట సమయ మందు కాచువాడెహితుడు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

28. ఎదుటివారు మనకు ఏమి చేసిన మేలొ
అట్టి మేలు మనమునందచేయ
జగములోన వెలుగు సహకారభావమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

29. అందరానిదాని నాశించకుండంగ
సాధ్యమైన బాటసాగవలయు
పిండి కొలదె రొట్టెయుండుటచూడమే
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

30. కొండలున్న యపుడె మెండుగా వృక్షాలు
పెరుగుననెడి మాట నెరుగ వలయు
కొండవలన మేలు కొల్లలై యుండును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

31. యంత్రశాల లెన్నొ వ్యర్థపదార్థాలు
నదులలోన విడువ నష్టమగును
కలుగు ప్రాణ హాని కలుషమ్ము వలననే
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

32. మేలు పొందగానె మెప్పు కృతజ్ఞతల్
చెప్పుచుండ వలయు నెప్పుడైన
చేసినట్టి మేలు చెదరని సంపద
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

33. గర్వమున్నవాడు సర్వమ్ము తనదంచు
పెద్దవారి ముందు ప్రేలుచుండు
చెడ్డ గర్వముననె శిశుపాలు డణగెరా
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

34. ప్రతిదినమ్ము వచ్చు వార్తల పత్రికల్
చదువుచుండ వలయు శ్రద్ధతోడ
విశ్వ విషయమెల్ల వివరించు పత్రికల్
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

35. ఎంత తెలివి యున్న కొంత అభ్యాసమ్ము
అవసరమ్ములగును అందరకును
పదును పెట్టుకున్న పాడౌను ఖడ్గమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

36. అన్యభాష నేర్చుట వసరమ్మేగాని
మాతృభాష నెపుడు మరువరాదు
తల్లి బాస మూల ధనమనుట నిజము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

37. దుర్జనుండు చూచు దోషాల నెప్పుడు
మంచివాడు చూచు మహిత గుణము
మంచి చెడ్డలరసి మన్నింప మేలౌను
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

38. నిప్పు కణికవోలె నిన్ను గాల్చుచునుండు
చెడ్డవారి మైత్రి చేటు దెచ్చి
మంచి జనుల మైత్రి మధురాతి మధురమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

39. పుస్తకమ్ము, డబ్బు, పూబోడి యొకసారి
పరులచేతిలోన పడిన యెడల
రావు, వచ్చినపుడు భ్రష్టమై యుండును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

40. పిల్లవాడు తాను తల్లిదండ్రులయొద్ద
పెరిగిపెద్దయగుచు పేరు పొందు
పండితుండు గాడు ప్రభవించినప్పుడే
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

41. అన్ని వేళలందు అనుకూల ఫలితాలు
వచ్చుననుట వాస్తవమ్ము గాదు
ఓటమి గెలుపునకు బాటలు తీయును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

42. పదమునుచ్చరించు ప్రతిభయుండవలయు
తప్పు తోడ పలుక తగదు పదము
పదము తీరుచూడ పరబ్రహ్మరూపమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

43. పెద్దలెపుడు ప్రేమ పెల్లుగా చూపంగ
పిల్లలందు తప్పు పెరుగుచుండు
'అతిని' వదలినపుడె అత్యంత శుభమౌను
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

44. ప్రక్కనున్న వారి వస్తువులను చూచి
దొంగిలించు బుద్ధి దోషమగును
ప్రక్క వారి సొమ్ము పాముని భావించి
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

45. కోర్కెలుండ వచ్చు కోటాను కోటులు
తీర్చగలరొ లేదొ తెలిసి కొనుచు
తల్లిదండ్రి నడుగ ధర్మమై యుండును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

46. జగడమాడరాదు జతనున్న వారితో
స్నేహ భావమెపుడు చెదరరాదు
కలుపుగోలు తనము ఘనతను గూర్చును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

47. ఆంగ్ల భాషమీద అధిక వాంఛలు చూపి
తల్లి బాసనేమొ తరుగ చేయ
ఉచితమగునె మనకు ఊహలోనైనను
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

48. అంగిలేయు లెపుడొ హాడలి పోయినగాని
వారి భాష మనల వదలకుండె
పోయె బిడ్డ కాని పోదుపురిటికంపు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

49. నీతి కథల నెన్నొ నియమమ్ముగానేర్వ
బుద్ధి వికసనమ్ము పొందుచుండు
జ్ఞానధనము మించు సంపదలేదెందు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

50. పలక పట్ట దగిన ప్రాయమ్మునందున
పార పట్టి గట్టి పనులుచేయు
బాలలుండు దేశ భాగ్యమ్ము నశియించు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

51. పుస్తకాల బరువు మోయగ లేనంత
చేయుచుండు విద్య చేటు తెచ్చు
గణము కాదు లెక్క గుణములోనుండును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

52. తేనె పట్టుకొట్ట తేనె వెంటనెరాదు
ఈగలన్ని లేచి వేగకుట్టు
పాటులెన్నొ దెచ్చు పరుషమౌ వర్తనల్
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

53. జీవసాగరమ్ము శ్రేయంపురీతిలో
దాటవలయునన్న తప్పకుండ
స్నేహ మనెడి నావ నెప్పుడు విడువకు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

54. నిన్ను తిట్టినట్టి నీ శత్రులకెపుడు
భయము పడగ వద్దు బ్రతుకునందు
నిన్ను మెచ్చుహితుల నెప్పుడు కనిపెట్టు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

55. దేహసాధనమున దేహమ్ము దృఢమౌను
మంచి పుస్తకమ్ము లెంచి చూచి
శ్రద్ధతోడ చదువ బుద్ధిపదునుదేరు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

56. పుస్తకములు మనకు పూజ్యులౌ గురువులై
జ్ఞానధనము నిచ్చి చక్కబరచు
కోపమేమిలేని గురువులే పొత్తముల్
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

57. క్రొత్త ప్రాంతములకు కోరి తీసుకపోవు
పుష్టి కలుగు ఓడ పుస్తకమ్ము
వాయి తెరువనట్టి వక్తయే పొత్తమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

58. తనువు కవసరమ్ము తగినంత భుక్తియే
చిత్త శుద్ధికి తగుచిన్న వాక్కు
హితము గూర్చు చుండు మితమగు పనులెల్ల
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

59. పసిడిలోన గలుగు 'ప్రతిసన్న' తీగెకు
విలువ ఉండునంచు తెలిసి కొనుము
క్షణము క్షణము విలువ కాలానికుండును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

60. మనసు గొప్పదైన మనుజుండు ఘనుడగు
కుత్సితంపు మనసు కూల్చునరుని
కపటబుద్ధి వీడి కదలుట హితమౌను
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

61. ఆచరించ వలయు నభ్యసించిన విద్య
ఆచరించకున్న నగును చేటు
అనుభవమ్ము లోనె అలరారు విద్యలు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

62. స్వార్ధరహితమైన సాంఘిక సేవయే
శ్రేష్ఠ మతమటంచు చెలగుమింక
సేవ వలన కీర్తి చేకూరునెప్పుడు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

63. పరుష వాక్కులెపుడు పల్కకుండుటమేలు
కఠినమైన మాట కాల్చు నరుని
మంచి వాక్కు తోడ మన్ననల్ ప్రాప్తించు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

64. విద్య నేర్చునపుడె విపులాశయమ్ములు
కలిగి యండవలయు కాంక్షచూపి
ఆశసిద్ధి కలుగు నహరహముశ్రమించ
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

65. ధనము వచ్చుచుండు తరిగిపోవుచునుండు
విద్యయనెడి ధనము హృద్యమగుచు
శాశ్వతముగ నిల్చి సత్కీర్తి యొసగును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

66. బురదలోన పుట్టు పుష్పమ్ము వెదజల్లు
సౌరభమ్ము నెపుడు చక్కగాను
పుట్టు నెలవు కాదు పూతగుణము చూడు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

67. బద్ధకమ్ము విడుము పనులుచేయునపుడు
బద్ధ శత్రువగును బద్ధకమ్ము
బద్ధకమ్ము కలుగ బాగుపడడెవడు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

68. అక్షరమ్మునైన ననువుగా నేర్పిన
గురువు ఋణము దీర్చు కొరకు చూడ
వస్తువేది లేదు వసుధపై యత్నింప
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

69. కష్ట సమయ మందు కంది పోవగరాదు
పొంగరాదు సుఖము పుట్టినపుడు
కష్టమును సుఖమును గణియించు సమముగా
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

70. ఉన్నకాలమందె ఉత్తమ గుణములు
సంక్రమింప చేసి సాగవలయు
మంచి గుణములెపుడు మహనీయతనుగూర్చు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

71. విద్య నేర్చుకొనుట పెద్దకష్టమనుచు
తొలగిపోవరాదు తొందరపడి
వజ్రమునకు సాన వన్నెను చేకూర్చు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

72. ఉత్తమంపు శ్రేణినుత్తీర్ణతన్బొంద
మొదటి నుండి బాగ చదువ వలయు
ముందు చూపుతోడ ముప్పులు తప్పును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

73. మంచి వాడు సతము మాటాడు మెత్తగా
వదరుబోతులెపుడు వాగుచుంద్రు
ఏమిలేని ఆకు ఎగిరిపడుచునుండు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

74. అవసరమ్ముతోడ నలమటించుచునుండ
దానమొనరచేయ ధర్మమగును
పాత్ర నెఱిగి దాన భావమ్ము చూపుము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

75. సాటి వారి గూర్చి చాడీలు చెప్పంగ
స్నేహ భావమునకు చేటు కలుగు
చాడిచెప్పు బుద్ధి చంపుట యుక్తమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

76. పెద్ద వారి పట్ల వినయమ్ము చూపంగ
బలము పెరుగుచుండు బాగుగాను
అధిక కీర్తి గలుగు నాయువు వర్ధిల్లు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

77. నిందలేని యట్టి నిజమైన మనుగడ
కోరు కొనగ వలయు కూర్మితోడ
ఒక్క నిందయైన నొన గూర్చునప కీర్తి
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

78. అతిథి దేవుడనెడి ఆర్యోక్తి గమనించి
ఆదరించ వలయు నతిథినెపుడు
అతిథి తృప్తితోడ నరుగుచుండ వలయు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

79. జన్మదినము బాగ జరుపుకొనెడు వేళ
పసలు లేని ఖర్చు వదలి వైచి
పేద సాదలకిడ 'పెను పుణ్య'మబ్బును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

80. తల్లిదండ్రులెపుడు పిల్లలన్‌పెంచుచు
విద్య నేర్ప వలయు ప్రేమచూపి
విద్య నేర్పకుండు పితరులు శత్రువుల్
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

81. చిత్రలేఖనమున చిత్తమ్ము గమియింప
శ్రద్ధ చూపి నేర్వ బుద్ధి పెరుగు
చిన్ననాటి శ్రద్ధ సత్కీర్తి సమకూర్చు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

82. చదువు గుణముతోడ చక్కగా వినుబుద్ధి
కలిగియుండవలయు గట్టిగాను
ఇట్టి గుణములెల్ల హెచ్చించు ప్రతిభను
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

83. త్యాగ ధనుల గూర్చి యోగజీవుల గూర్చి
తెలిసి కొన్న యపుడు తెలివి పెరుగు
అట్టి వారి గుణము లాశీస్సులైయుండు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

84. ఇంటిలోని చెత్త వెంట దీసుకుపోయి
వీధిలోన నెపుడు విడువరాదు
శుభ్ర పరిసరాలు సుఖములు చేకూర్చు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

85. తాను తక్కువనెడి న్యూనతా భావమ్ము
వదలు చుండవలయు బాగుపడగ
అన్ని గూర్చుచుండు ఆత్మవిశ్వాసమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

86. చెప్పునట్టి మాట చేదుగానున్నను
నిజము చెప్పవలయు నియతరీతి
మాత్ర చేదుదైన మాన్పురోగమ్మును
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

87. శాస్త్ర విద్యలోన సన్నుతి కెక్కినన్
మానవతయె ముఖ్య మవని మీద
కరుణలేని విద్య గణుతికెక్కదెపుడు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

88. నీరు కలుషితమ్ము నింగి కలుషితమ్ము
గాలి చూడ మిగుల కలుషితమ్ము
మనిషి మనసు చూడ మరి యెంతొ కలుషమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

89. ధనము లేని వారు ఘనమైన కోర్కెలన్
చదువు నభ్యసింప సాగదిపుడు
విద్య సాగకుండె విత్తమ్ములేకున్న
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

90. చిత్త మిష్ట పడగ శీతల పానీయ
స్వీకరణము మిగుల చేటు కూర్చు
కోరి తాగవలయు 'కొబ్బరిబోండమున్'
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

91. ఆకలైన యపుడె ఆరగించవలయు
ఒక్కసారి నోటకుక్కరాదు
నమలి నమలి మ్రింగ నమరునారోగ్యమ్ము
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

92. నమ్మకమ్ము వలయు నరునిపై నరునకు
నమ్మలేనినాడు వమ్ముబ్రతుకు
గుడ్డినమ్మకమ్ముగొడవలు సృష్టించు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

93. విద్యలోన నెట్టి విషయమ్ములైనను
కష్టమనుచుతోచ విష్టమున్న
శ్రద్ధ పెంచుచుండు శుద్ధగురులబోధ
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

94. తనను మించునట్టి ఘనుడులేడనినమ్మి
విఱ్ఱవీగు టెల్ల వెఱ్ఱితనము
తాడి దన్ను వాని తలదన్ను వాడుండు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

95. పుస్తకాలు చదువ పోవును కోపమ్ము
పుస్తకాలు చదువపుట్టు తెలివి
పుస్తకాల రచన పుట్టించు సత్కీర్తి
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

96. మనసులోన విషము మాటలో నమృతము
చూపునట్టి వాడు సుమతి కాడు
త్రికరణంపు శుద్ధి తేజమ్ము హెచ్చించు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

97. మాతృభాష నేడు మాకు రాదని పల్కు
జనులు పెరుగు చుండె జగతిలోన
'అమ్మ బాసమరువ నధమాధముండగు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

98. పనికి రాక యెచటొ పడియున్న రాతిని
అందమైన శిల్ప మటుల చెక్కు
గురుని మించు శిల్పి గుర్తింప శక్యమే
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

99. అందమైన రూపమధికమ్ము గానున్న
గణ్యమైన రీతి కలిమి యున్న
విద్య లేక నరుడు వెలుగొంద లేకుండు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

100. అధిక బలము గలుగు నధికుండ నేనంచు
లెక్క చేయకున్న చిక్కుగలుగు
గడ్డి తాటి చేత గజము బంధితమగు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

101. గొప్ప వారలైన తప్పులు చేయుట
సహజమగును చూడ జగతిలోన
తప్పు దిద్దుకొనెడి తత్త్వమ్ము మంచిది
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

102. ప్రేమ సుధకు నెలవు ప్రియమైన అమ్మయే
సర్వ సద్గుణాల సాక్షి అమ్మ
అమ్మ సాటి తెలుపు అమ్మయే అని యెంచి
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

103. తాను తినక యున్న తన బిడ్డ నోటికి
పెట్టు చుండు నమ్మ ప్రేమమూర్తి
సకల దేవతాళి సాకారమే అమ్మ
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

104. ఎట్టి కష్టమైన గుట్టుగా నుంచక
ఎఱుక పరుప వలయు నింటి వద్ద
కన్నవారి ప్రేమ కడవారి కుండునా?
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

105. అమ్మ మొదటి గురువు అనెడి మాట నిజము
పదము పదము నేర్పు పంతులమ్మ
అమ్మ మించు గురువు అవనిలో లేకుండురా
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

106. ముద్ద ముద్ద కలిపి ముద్దుగారెడునట్లు
బోసినోటిలోన బువ్వ పెట్టు
అమ్మమించునట్టి ఆరాధ్యులేలేరు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

108. పేరు పొందినట్టి ప్రియమైన బిడ్డలన్
కాంచి సంత సింత్రు కన్నవారు
అమ్మ నాన్న మించు ఆత్మబంధులు లేరు
తెలిసి మెలగ మేలు తెలుగు బాల.

109. తెలుగు బాల పేర వెలువరించినయట్టి
శతక పద్యములను శ్రద్ధతోడ
చదివినను వినినను జ్ఞానధనము వచ్చు
స్ఫూర్తి గలుగు మరియు కీర్తి పెరుగు



## తెలుగుబాల శతకం

జననం : 1-6-1958 వేజండ్ల, చేబ్రోలు మం॥, గుంటూరు జిల్లా.
జననీజనకులు : పార్వతమ్మ - అయితమరాజు
ప్రాథమిక విద్య : వేజండ్ల
ప్రాథమికోన్నత విద్య : నారాకోడూరు, గుంటూరుజిల్లా.
ఉన్నత పాఠశాల విద్య : సంగంజాగర్లమూడి, గుంటూరుజిల్లా.
కాలేజీ చదువు : హిందూకళాశాల, గుంటూరు (1973-1978)
స్నాతకోత్తర విద్య : ఎం.ఏ. తెలుగు - నాగార్జున విశ్వవిద్యాలయం (1978-1980)లో ఎం.ఏ.లో సర్వప్రథమునిగా ఉత్తీర్ణత సాధించినందుకు కీ॥శే॥ శ్రీమతి బాలిశెట్టి వెంకటసుబ్బమ్మ మెమోరియల్ 'గోల్డ్ మెడల్'
పిహెచ్.డి. : నాగార్జున విశ్వవిద్యాలయం (1985) అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనలు.
ఉద్యోగం : ఆంధ్రోపన్యాసకత్వం : 1981 సెప్టెంబరు నుంచి 1988 జులై వరకు సప్తగిరి కళాశాల విజయవాడ. 1988 ఆగష్టు నుంచి ఆంధ్ర లొయోల కళాశాల, విజయవాడ.
పరిశోధక పర్యవేక్షణ : ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసాలు - 10.
అవార్డులు : (1) యు.జి.సి కెరీర్ అవార్డు - తెలుగు జానపద ప్రదర్శన కళారంగం అనే ప్రాజెక్టుకు (1992-1995) . (2) సెల్‌ఫోన్ శతకానికి ఉత్తమ శతకరచన బహుమతి - నల్లజర్ల జగన్నాథ సాహితీ సమాఖ్య 2006. (3) 'నత్తవిలాపం' పద్యఖండికకు సాహితీ మిత్రులు మచిలీపట్నం వారి జాతీయస్థాయి ప్రథమ బహుమతి - 2007. (4) ఆంధ్రప్రభ దినపత్రిక నిర్వహణలో జరిగిన పుస్తక సమీక్షల పోటీలో ప్రథమ బహుమతి - 2007. (5) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు సెప్టెంబరు 5-2008. (6) మా నాన్న కవితకు హైదరాబాద్ కిన్నెర ఆర్ట్ థియేటర్స్ వారిచే ప్రథమ బహుమతి.
రచనలు - ముద్రితాలు : 1) అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనలు - 1990.
2) ప్రాచీనాంధ్ర కవయిత్రుల స్త్రీ స్వభావచిత్రణం -1991.
3) అన్నమయ్య (నవల) 2000 (4) సెల్‌ఫోను శతకము 2005.
5) సాహిత్యం - సామాజికచైతన్యం (వ్యాససంపుటి) 2008.
6) శ్రీ వేంకటాద్రీశ్వర శతకం 2009. (7) తెలుగుబాల శతకం 2010.
8) శ్రీశ్రీ శతకం 2010.
ముద్రణకు సిద్ధం : 1) అన్నమయ్య భక్తిపద కవిత (2) జాషువా సాహిత్య సమీక్ష
3) కన్యాశుల్కంలో హాస్యం. (4) సాహితీ సౌరభం.
(5) సూక్తి మాలిక.
రేడియో ప్రసంగాలు : 50కి పైగా ఆకాశవాణి విజయవాడకేంద్రం నుంచి.
దూరదర్శన్ కార్యక్రమాలు : 9.
జాతీయ/రాష్ట్రస్థాయి సదస్సులలో : 50కి పైగా ప్రసంగ పత్రాల సమర్పణ.
అంతర్జాతీయ సదస్సులు : 4.
వ్యాసాలు : 120కి పైగా వివిధ పత్రికల్లో - పుస్తక సమీక్షలు 125కి పైగా - జాషువాపై అనేక సాహిత్య ప్రసంగాలు - ఆచార్య నాగార్జున, ఆంధ్ర, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం దూరవిద్యాకేంద్రాలకు డిగ్రీ ఎం.ఏ. తరగతులకు పాఠ్యాంశ రచనం.